## బాలగోపాల్ పదవ వర్ధంతి సందర్భంగా...

# ప్రశ్నే ప్రజాస్వామ్యం

## ప్రశ్నిస్తున్న గొంతులను విందాం రండి



మిత్రులారా,

ఒక సంక్షోభం లోంచి మరో సంక్షోభంలోకి, ఒక విపత్తు నుండి మరో విపత్తులోకి, ఒక భయం నుండి మరో భయంలోకి ప్రయాణిస్తోంది నేడు భారతదేశం. ప్రజాస్వామిక విలువల ఆధారంగా నడవవలసిన పాలనా వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా కళ్ళ ముందే కుప్పకూలిపోవడం చూస్తున్నాం. సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలు సంక్షోభంలో కూరుకుపోవడం చూస్తున్నాం. వాటి ఫలితాలను ప్రత్యక్షంగానే అనుభవిస్తున్నాం. అయినా ఇవేవీ సమాజానికి పట్టినట్టు కనిపించడం లేదు. ఇప్పటిదాకా వారి గుండె మూలల్లో దాగుందని మనం గుర్తించలేకపోయిన మెజారిటీ మతాధిక్య భావనను వెలికి తీసి కాషాయ దళం అధికారంలోకి వచ్చింది. బిజెపి అమలు చేస్తున్న అప్రజాస్వామిక విధానాలన్నింటికీ సామాజిక ఆమోదం లభించడానికి ఈ భావనే కారణమవుతోంది - అది కశ్మీర్ విషయమయినా, మరొకటయినా. ఉచితానుచితాలు, తరచి చూసే విచక్షణలు పోయి హిందూ మతతత్వం, ఉద్రేకం తలకెక్కాయి.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య ఉండాల్సిన రేఖలను చెరిపేస్తూ, అందరినీ లొంగదీసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. విధాన నిర్ణయాల్లో మార్పులు చేసేటపుడు వాటిని ప్రజల మధ్య చర్చకు పెట్టడం కనీస ప్రజాస్వామిక విలువ. ఏ సందర్భంలోనూ దీన్ని అనుసరించిన దాఖలాలు వీరి పాలనలో కనపడవు. నియంతృత్వం, మనువాదం, జాతి దురహంకారం, పురుషాహంకారం వంటి అప్రజాస్వామిక భావజాలాలన్నిటిలోనూ ఉండే 'మేము చెబుతున్నాం, వినండి, అంతే' అనే ఒక ఆధిపత్య ధోరణి వీరి పాలనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒక రాష్ట్రానికి స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేయడం వంటి కీలక రాజకీయ నిర్ణయాలు తీసుకునేటప్పుడు గానీ, 120 కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేసే నోట్ల రద్దు, జి.ఎస్.టి. అమలు వంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు గానీ ఇదే ధోరణి కనబడడం మనం గమనించవచ్చు.

బిజెపి ప్రభుత్వం 2014 నుండి ఈ ఏడాది మే నెల వరకు పార్లమెంటులో 186 బిల్లులను ప్రవేశపెడితే అందులో 142 బిల్లులు ప్రజలను సంప్రదించకుండానే ప్రవేశపెట్టినవి. దేశ పర్యావరణాన్ని కాపాడాల్సిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి సంస్థలను నీరుగార్చే చట్టాల్ని కూడా గుట్టుచప్పుడు కాకుండా మనీ బిల్లులుగా ప్రవేశపెట్టింది.

ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర వోటు వేయడంతో అయిపోయిందని బిజెపి అనుకుంటే అనుకుంది; కాని ప్రజలు కూడా దానిని విశ్వసించడం మొదలుపెడితే ప్రమాదం. అంతే కాదు, తాము కూడా వారి అడుగుజాడల్లో నడిచి ఎవరి సొంత అజెండాలను వారు అమలు చేసుకోవాలనుకునే సమూహాలు పుట్టుకు రావడం, భయంతోనో, అజ్ఞానంతోనో వారికి వత్తాసు పలికే జనాభిప్రాయం రోజురోజుకీ విస్తరిస్తుండడం అంతకంటే ప్రమాదం. దేశం ఈ రోజు ఆ ప్రమాద ఘడియల్లో ఉంది. ముస్లింలను, దళితులను కొట్టి చంపిన అనేక ఘటనలలో హిందూ ఆధిపత్య కులాలవారే కాదు, పీడిత సమూహాలు కూడా భాగస్వామ్యం కావడం చూస్తున్నాం. ఈ అప్రజాస్వామిక, హింసాత్మక ధోరణులను రెచ్చగొట్టడంలో సంఘ్ పరివార్ నూటికి నూరు పాళ్ళు సఫలీకృతమయ్యింది.

### కార్యక్రమం

తేది : **13 అక్టోబర్ 2019**

సమయం: **ఉ॥ 10 నుండి సా॥ 5 గంటల వరకు**

స్థలం: **సుందరయ్య విజ్ఞాన కేంద్రం,**
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

**కశ్మీర్: వార్తల్లో మనకు చెప్పని విషయాలు**
సంజయ్ కక్
రచయిత, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత

**సఫాయి కార్మికుల ఆత్మగౌరవ పోరాటం**
బెజవాడ విల్సన్
సఫాయి కర్మచారీ ఆందోళన్ జాతీయ అధ్యక్షులు

**అస్సాం - జాతీయ పౌరసత్వ జాబితా సృష్టిస్తున్న భయాందోళనలు**
తీస్తా సెతల్వాద్
హక్కుల కార్యకర్త, జర్నలిస్ట్

**అణువిద్యుత్తు అన్నివిధాలా చేటు**
ఎస్.పి. ఉదయ్ కుమార్
అణువిద్యుత్తు వ్యతిరేక ఉద్యమకారుడు

మతోన్మాద, అప్రజాస్వామిక పాలనా విధానాలకు తోడు మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ తదితరులు వ్యక్తిగత కక్ష సాధింపు కోసం రాజకీయాలను నిస్సిగ్గుగా వాడుకుంటున్నారు. ఈ చర్యల్లో భాగంగా న్యాయ వ్యవస్థను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. అమిత్ షాని జైలుకి పంపిన బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అకిల్ ఖురేషిని త్రిపుర హైకోర్టుకు, 2002 నాటి గుజరాత్ మారణకాండలో బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసు నిందితులకు శిక్షలు వేసిన మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తాహిల్ రమణిని మేఘాలయ హైకోర్టుకు బదిలీ చేసారు. ఈ కక్ష సాధింపు చర్యలకు సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గగోయి, కలీజియంలోని మరో ఇద్దరు సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజాస్వామ్య మనుగడ న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యంపై ఆధారపడి ఉందని ఆనాడు ప్రెస్‌మీట్‌లో గగోయి అన్న మాటలు ఆయనే ఇంత త్వరగా మర్చిపోతే, న్యాయమూర్తులకే 'బదిలీ శిక్షల' నుండి రక్షణ లేకపోతే ఈ దేశ సామాన్యుడి పరిస్థితి ఏమిటి?

ఈ హిందూ ఫాసిస్టు ధోరణులను ఎంతో ముందుగా గుర్తించి ఎన్నో ఏళ్ళుగా మనలను హెచ్చరిస్తూ వచ్చిన హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్. సిద్ధాంత, కార్యాచరణల మేలు కలయికైన ఈ హక్కుల కార్యకర్త మనల్ని వీడి నేటికి పదేళ్ళు. అయితే ఆయన మిగిల్చి వెళ్ళిన అపార సాహిత్య సంపద కొత్త కొత్త రూపాల్లో మన ముందుకు వస్తున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి, అవసరమైన కార్యాచరణను రూపొందించు కోవడానికి ఇప్పటికీ ఉపకరిస్తోంది.

ఇక మీడియా విషయానికి వస్తే అది ఏ నాడో బిజెపికి బాకాగా మారింది. ఫోర్త్ ఎస్టేట్‌గా, ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన మీడియా 'మోడియా'గా వ్యవహరిస్తోంది. రాష్ట్రాలలోనూ అదే పరిస్థితి. అధికార చట్రంలో ఒక పావుగా మారిపోయింది. మీడియాలో అసమ్మతి గళం వినబడే పరిస్థితి నేడు లేదు.

ఒక సిద్ధాంతంగానే నేటి కాషాయ ప్రభుత్వానికి సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉండడం ఇష్టం లేదు. ఒకే దేశం, జాతి, మతం, భాష, అభిప్రాయం ఉండాలనుకునే విధానం వారిది. ఇది ఫాసిజం తప్ప మరేమీ కాదు. భిన్నాభిప్రాయాన్నీ, అసమ్మతి ప్రకటననీ, ప్రతిపక్ష మనుగడనూ అది సహించలేదు. అందుకే 'ఊపా' (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం) లాంటి అప్రజాస్వామిక చట్టాలకు మరిన్ని కోరలు చేరుస్తోంది. అసమ్మతి ప్రకటించిన వారిని జైళ్ల పాలు చేస్తోంది. మీడియా గొంతు నొక్కడమయినా, చివరకు ప్రతిపక్ష పార్టీలపై ఏదో మిష మీద దాడులు చేసి వేధించటమైనా అందులో భాగమే. తమ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు తలెత్తకుండా చేయడంలో, అసలు ప్రతిపక్షమే లేకుండా చేయడంలో వాళ్ళు దాదాపు విజయం సాధించినట్టే కనబడుతోంది. ఇది ఎన్నాళ్ళు కొనసాగుతుందో, ఇలాంటి ధోరణుల పట్ల మౌనం వహించే సహనం ప్రజలకు ఎన్నాళ్ళు ఉంటుందో వేచి చూడాల్సిందే.

కేంద్రంలోని బిజెపి వ్యవహార శైలినే రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులూ అనుసరిస్తున్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందూ వెనకా ఎవరికీ ఎటువంటి చర్చకూ అవకాశం ఇవ్వడం లేదు. ఎన్నికైన ప్రభుత్వం ద్వారానే నియంతృత్వాలు ఏర్పడడం నేటి విషాదం. జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని ఒక పెన్ను పోటుతో రెండు ముక్కలు చేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిస్తే ఢిల్లీ, ఒరిస్సా, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రులు దాన్ని వ్యతిరేకించాల్సింది పోయి సమర్థించడం ఎంత సిగ్గుచేటు! రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కేంద్రం కబళిస్తున్నా అధికార, ప్రతిపక్షాలలో ఉన్న ప్రాంతీయ పార్టీలు అవకాశవాద ధోరణిలో కొట్టుకుపోతున్నాయే కాని సమాఖ్య విధానానికి ఎంతటి హాని జరుగుతున్నదో గుర్తించడం లేదు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించే ధైర్యం లేదు. మళ్ళీ తమ రాష్ట్రాల్లో నిరసనకారుల గొంతు నులమడంలో వారు కేంద్రానికేమీ తీసిపోరు..

ఇదీ నేటి మన భారతదేశ చిత్రపటం. ఈ హిందూ ఫాసిస్టు ధోరణులను ఎంతో ముందుగా గుర్తించి ఎన్నో ఏళ్ళుగా మనలను హెచ్చరిస్తూ వచ్చిన హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్. సిద్ధాంత, కార్యాచరణల మేలు కలయికైన ఈ హక్కుల కార్యకర్త మనల్ని వీడి నేటికి (2009 అక్టోబర్ 8న) పదేళ్ళు. ఈ పదేళ్లుగా ఆయన లేని లోటును అనుక్షణం గుర్తు చేసుకుంటూనే ఉన్నాం. ఆయన సునిశిత విశ్లేషణా శక్తినీ, స్ఫూర్తిదాయకమైన కార్యాచరణనూ కోల్పోయినందుకు నేటికీ బాధ పడుతూనే ఉన్నాం. అయితే ఆయన మిగిల్చి వెళ్ళిన అపార సాహిత్య సంపద కొత్త కొత్త రూపాల్లో మన ముందుకు వస్తున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి, అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవడానికి ఇప్పటికీ ఉపకరిస్తోంది.

బాలగోపాల్ గారి స్మృతిలో మేము ప్రతి ఏడాది సమకాలీన హక్కుల సమస్యలపై సభలు నిర్వహిస్తూ వస్తున్న విషయం మీకందరికీ తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ – ఆచరణలోనే కాదు, రాజ్యాంగంలో సైతం తమ స్వయం ప్రతిపత్తిని కోల్పోయిన కశ్మీర్ ప్రజల గురించి 'వార్తల్లో మనకు చెప్పని' విషయాల గురించి తెలుసుకుందాం. స్వచ్ఛ భారత్ గురించి పదే పదే మాట్లాడే ప్రధానమంత్రి మోదీకి నేటికీ మానవ మలాన్ని ఎత్తి పోసే అమానవీయ పనితో పొట్ట పోసుకుంటున్న సఫాయి కార్మికుల కడగండ్లు మాత్రం ఎందుకు కనబడడం లేదో తెలుసుకుందాం. అస్సాంలో జాతీయ పౌరసత్వ జాబితా (ఎన్.ఆర్.సి.) నుండి తొలగించబడ్డ 19 లక్షల మంది భవిష్యత్తు ఏమి కానున్నదో తెలుసుకుందాం. నల్లమలలో, నల్గొండలో, కర్నూలులో యురేనియం తవ్వకాల కోసం జరుగుతున్న ప్రయత్నాల నేపథ్యంలో, తుమ్మలపల్లెలో ఇప్పటికే మనం చూస్తున్న నష్టాల నేపథ్యంలో అణు ధార్మికత వలన కలగబోయే పెనుముప్పు గురించి తెలుసుకుందాం. అన్ని వ్యవస్థలూ కూలిపోతున్న ఈ తరుణంలో ప్రశ్నే ప్రజాస్వామ్యం. అందుకే ప్రశ్నించే గొంతులను విందాం రండి. మార్పు కోసం చేయగలిగిన కృషి చేద్దాం రండి.

---

**8.10.2019**

**హైదరాబాద్**

**మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)

ప్రచురణ : జీవన్ 9848986286; ముద్రణ : అనుపమ ప్రింటర్స్, శాంతినగర్, హైదరాబాద్. 040–23391364